# వస్తువు

పేషెంట్స్ వెయిటింగ్ హాల్‌లో వున్న మ్యూజిక్ ఛానెల్‌లో ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి కంఠం త్యాగరాయ కృతుల్ని వినిపిస్తూంది. అక్కడ డాక్టర్ శ్రుతిచేత పరీక్ష చేయించు కోవడం కోసం వేచివున్నవారిలో కొంతమందికి ఆ సంగీతం ఎంతో ప్రశాంతతను కలిగిస్తూంటే, సినిమా పాటలంటే చెవికోసుకునే కొందరికి విసుగును కలిగిస్తూంది. విపరీతమైన టెన్షన్‌తో శ్రుతి రాక కోసం ఎదురు చూస్తున్న సీతారత్నం చెవుల్లోకి ఆ సంగీత తరంగాలు ప్రవేశించడం లేదు.

ఆపరేషన్‌చేసి ఛాంబర్‌లోకి హడావిడిగా వచ్చిన శ్రుతిని చూడగానే సీతారత్నం గుండె కొంచెం కుదుటపడింది. మళ్ళీ అంతలోనే ఆందోళన. పరీక్ష చేశాక ఏం చెబుతుందోననే భయం. "మీకు గర్భమేనమ్మా! మూడోనెల" అంది గ్లోవ్స్ తీసేస్తూ శ్రుతి. పరీక్ష బల్లదిగి ప్రక్కన నుంచుని నేల చూపులు చూస్తూంది సీతారత్నం. "ముగ్గురు పిల్లలుండగా యింకా ఎందుకు ఆపరేషన్ చేయించుకోలేదు మీరు? ఆపరేషన్ చేయించు కోకుండా ఇప్పుడు దిగులు పడితే ఏం లాభం?" ప్రతిరోజూ ఇలాంటి పరిస్థితిలో వచ్చే స్త్రీలను చూసి చూసి ఎప్పటికి మారతారు వీళ్ళు? కాదు కాదు ఎప్పటికి మారనిస్తారు వీళ్ళను? ఎప్పటికి యీ పిల్లల్ని కనే యంత్రాలకు నిర్ణయాధికారం లభిస్తుంది? అనుకుంది శ్రుతి.

"అమ్మగారూ! బైటొచ్చేయడానికి మందులివ్వండి" కళ్ళెత్తి భయంగా చూస్తూ అడిగింది సీతారత్నం.

"గర్భం వచ్చాక మందుల్తో బహిష్టు రాదు. చిన్న ఆపరేషన్ చేసి గర్భాన్ని తీసేయాలి". అంది శ్రుతి... తప్పదు. అఖ్ఖర్లేని ప్రసవాల బాధేకాదు, నివారించగలిగిన గర్భస్రావాల బాధకూడా యీ పిల్లల్ని కనే యంత్రాలకు తప్పదు. రోజూ చూసే సంఘటనలే అయినా ఎప్పటికప్పుడు శ్రుతి మనసులో కలత.

"రెండు నెలలే కదమ్మగారూ! తొందరగా వస్తే మందుల్తో పోతుందని యింత తొందరగా వచ్చాను. మంచి మందేదన్నా రాసివ్వండి" బ్రతిమాలుతున్నట్లుగా అడిగింది సీతారత్నం.

"చెప్పాను కదమ్మా! మందులవల్ల గర్భం పోదు... సరోజా! యీవిడను బయటకు తీసుకెళ్ళి మళ్ళీ ఓసారి వివరంగా చెప్పు" అంటూ నర్స్‌ని చెప్పమని పురమాయించి మరో పేషెంట్‌ని పిలవమని చెప్పబోతున్న శ్రుతికి అడ్డొచ్చింది సీతారత్నం.

"అమ్మగారూ! కొంచెం యీ నర్సుగారిని బయటికి పంపి నేను చెప్పేది వినండి" అతి దీనంగా ఉన్న ఆమె స్వరం విని పరిశీలనగా ఆమె ముఖం వంక చూసింది శ్రుతి. నీళ్ళు నిండిన కళ్ళు, ఆందోళనతో అదురుతున్న పెదాలు, స్పష్టంగా కనిపిస్తున్న ఆమె శరీరంలోని వణుకు, ఆమె పరిస్థితిని గమనించకుండా ఆమె మనసు విప్పి చెప్పుకోవడానికి అవకాశమివ్వనందుకు శ్రుతి బాధపడింది. నర్స్‌ని బయటకు వెళ్ళమని చెప్పి సీతారత్నంని కూర్చోమని సైగ చేసింది. "ఎందుకంత భయపడుతున్నావు? ఏమీ నొప్పి తెలవకుండా చేస్తాను. ఎంతోసేపు పట్టదు. ధైర్యంగా ఉండు". శ్రుతి ఓదార్పు స్వాంతనను కలిగిస్తు న్నప్పటికి కడుపులో నుండితన్నుకు వస్తున్న భయాందోళనలు సీతారత్నాన్ని నిలవనివ్వడం లేదు.

"నువ్వు వచ్చేప్పుడు మీ ఆయనను కూడా తీసుకురా. అతనికి వాసెక్టమీ ఆపరేషను చేయించేస్తాను". సీతారత్నం శ్రుతి మాటలు విని ఏడుపు మొదలు పెట్టింది. భర్త ఒప్పుకోడనే భయంతో ఆమె ఏడుస్తోందని అనుకుంది శ్రుతి.

"పిచ్చిదానిలా ఏమిటా ఏడుపు? మీ ఆయన చేయించుకోవడానికి ఒప్పుకోకపోతే ఎబార్షన్‌తో పాటే నీకు ట్యూబెక్టమీ చేసేస్తాను" అంది శ్రుతి. సీతారత్నం ఏడుపు ఇంకా ఎక్కువయింది.

"అంత భయంగా ఉంటే పోనీ గర్భాన్ని ఉంచేసుకుని డెలివరీ అయాక ట్యూబెక్టమీ చేయించుకో". శ్రుతి చెప్పిందివిని సీతారత్నం కళ్ళుభయంతో వెడల్పుగా అయాయి.

"అమ్మో! ఉంచుకోవడమే! ఇంకేమన్నా వుందా?" గుండెమీద చెయ్యేసుకుని అంటున్న సీతారత్నం భయంలోని తీవ్రతను గమనించి శ్రుతికి ఏంచెయ్యాలో పాలుపోలేదు.

"మరయితే ఏం చేస్తావు? గర్భం ఉంచేసుకోమంటే అమ్మో ఉంచేసుకోవడమే అంటావు పోనీ తీసేస్తాను అంటే ఏడుపు మొదలు పెడుతున్నావు. నీతో ఎలా? పోనీ ఇంటికి వెళ్ళి మీ ఆయనతో కూడా ఆలోచించి నిర్ణయం తీసుకో" సామాన్యంగా అతని నిర్ణయాన్ని ఆమె శిరసా వహించడమే తప్ప కలిసి ఆలోచించుకుని నిర్ణయించుకోవడానికి అవకాశం ఉండదని శ్రుతికి తెలుసు. కాని సందిగ్ధంలో ఉన్న సీతారత్నానికి అంతకుమించి సలహా యివ్వలేకపోయింది.

"మా ఆయనతో చెప్పలేను. నాకు గర్భమని తెలిస్తే నన్నుచంపి కాకులకూ, గెద్దలకూ వేస్తాడమ్మా!' వధ్యశిల నెక్కబోతున్న దానిలా వజవజ వణికిపోతూందామె.

"అదేంటి? ఎందుకలా 'చేస్తాడు?" విస్తుపోతూ అడిగింది శ్రుతి.

"మా ఆయన ఆపరేషన్ చేయించుకుని అప్పుడే మూడేళ్ళు దాటిందమ్మా!" ఆందోళనతో అల్లల్లాడిపోతూంది సీతారత్నం. ఆశ్చర్యంగా ఆమె వంక చూస్తున్న శ్రుతి అంతలోనే తమాయించుకుంది.

"ఒకోసారి వాసెక్టమీ ఆపరేషన్ విఫలం కావచ్చు. అలాంటప్పుడు గర్భం రావచ్చు" సీతారత్నానికి ధైర్యం చెప్పడం కోసం అలా చెప్పింది కాని భర్త వాసెక్టమీ చేయించుకున్నాక భార్యకు గర్భం రావడానికి కారణం సామాన్యంగా ఆపరేషన్ ఫెయిలవడం కాదని శ్రుతికి తెలుసు. కాని కాపురాల విచ్ఛిన్నతకు దారితీసే 'స్త్రీ శీలం' అనే అంశానికి సంబంధించిన వాటిని తనంతట తాను ప్రస్తావించదు.

అణచుకోలేని అలజడితో వణికిపోతూంది సీతారత్నం. ఎబార్షన్ చేయించు కోవడానికి ఎంత ఖర్చువుతుందో! ఆయనకు తెలియకుండా ఎలా డబ్బు తీసుకురావడం?... హాయిగా కాకపోయినా పెద్ద ఒడిదుడుకులేమీ లేకుండా గడిచిపోతున్న కాపురంలో తనే చేజేతులా నిప్పులు పోసుకుంది. ఇల్లు, భర్త, పిల్లలు తప్ప వేరే ప్రపంచం తెలియని తననీ ఉచ్చులోకి లాగింది ప్రక్కింటి హైమ.

అప్పుడప్పుడు పూజకు తమ పెరట్లోని పువ్వులకోసం వచ్చే హైమ తనను పనిచేసుకోనివ్వకుండా గంటలు గంటలుపట్నం కబుర్లు చెబుతూ కూర్చునేది. పట్నం మనుషుల కబుర్లు, సినిమాల కబుర్లు, సినిమా నటుల కబుర్లు, మార్కెట్‌లోకి వస్తున్న రకరకాల అధునాతన వస్తువుల గురించి ఆ వస్తువులు యిచ్చే సౌఖ్యాలు, సంతోషాల గురించి విరామం లేకుండా ఆకర్షణీయంగా చెప్పేది. ముందు మొహమాటానికి, తరువాత విసుగుతో, ఎప్పుడీ వాగుడుకాయ వెళ్ళిపోతుందా ఎప్పుడు పనిచేసుకుందామా అని ఎదురు చూచే తను ఎప్పుడు ఆవిడ మాటల్ని ఆసక్తితో వినడం మొదలు పెట్టిందో గుర్తులేదు.

"ఏంటి సీతా? చివరకు గుడిసెల్లో వుండేవాళ్ళు కూడా టేప్‌రికార్డర్, టి.వి. కొనుక్కోకుండా

లేరు. పెంకుటింట్లో ఉండేదానిని నీకవి లేకపోవడమేమిటి? చక్కగా ఒక 'మిక్సీ' కొనుక్కుంటే చేతులు పడిపోయేలాగా రుబ్బుళ్ళు, దంపుళ్ళు ఉండవు గదా!" ఒకరోజు హైమ చెప్పిన మాటలు విని నవ్వేసింది తను. ఉన్న నాలుగెకరాల కొంౘ్ర తుపాను దెబ్బతగలకుండా ఉంటే తమకు సంవత్సరానికి సరిపడా ఆధరవు కల్పిస్తుంది. చాలీ చాలని డబ్బు, ఎప్పుడూ ఏవో అవసరాలు ఎదురు చూస్తూ ఉండడం వల్ల ఉన్నకాస్త డబ్బును చూచి చూచి అతిపొదుపుగా ఖర్చుపెట్టడం అలవాటయిపోయింది. అసలు అస్తమానం ఏదో ఒక పనితో, ఇంటిపని, గొడ్లపని, కోళ్ళపనితో తనకు వేరేవాటిని గురించి ఆలోచించడానికే తీరికుండదు.

"చాల్లే! ఏపూటకాపూట ఇంట్లో అందరికీ అయిదు వేళ్ళు నోట్లోకి వెళ్ళడమెలాగా అని నేనేడుస్తూంటే ఇంక కలర్ టి.వి., మిక్సీలు కూడానా నా మొఖానికి! పెట్టిపుట్టిన వాళ్ళు కొనుక్కోగలరు అవన్నీ, మాకెందుకు లేమ్మా ఆభోగాలన్నీ" అంది తను.

"భోగాలేమిటి? ఇవి కూడా భోగాలేనా? ఇవేమన్నా ఎ.సి.కార్లా, అందమైన భవంతులా? ఇవి కొనుక్కోవడం పెద్ద కష్టమేమీకాదు. కోరికుంటే కోటిదార్లు" హైమ కబుర్లు ఒట్టి డబ్బా కబుర్లు లాగా అనిపించాయి తనకు.

"ఏమోనమ్మా! నాకే దార్లూ తెలీవు. నాకేమీ గొంతెమ్మ కోర్కెలూ లేవు. ఓపికున్నంత వరకు చాకిరీ చెయ్యడం, కలిగింది తినడం, అంతే నాౘ్రబతుకు" అంది ముక్తసరిగా తను. కాని... తనకు శనిదేవత నెత్తి మీదుండి తరువాత తరువాత హైమ మాయమాటల్లో పడిపోయింది. కోరిన వస్తువుల్ని కొనుక్కోవడానికి డబ్బు సంపాదించే దారి సంగతి ఆమె చెప్పింది వినితన మతి పోయింది. గుండె దడ దడ లాడిపోయింది.

'ఛీ! ఇదా నువ్వు నాకు చెప్పేదారి? ఎన్నడూ మాఇంటా వంటా లేవిలాంటి దరిద్రపు పనులు' అంటూ హైమమీద విరుచుకు పడింది తను. అప్పుడు తెలిసింది తనకు తమకంటే తక్కువ పొలం ఉన్న హైమ ఇంట్లోకి అన్ని కొత్తకొత్త వస్తువులెలా వస్తున్నాయో? అంత దగుల్బాజీ పని తానెన్నటికీ చెయ్యదు. తమ వంశం ఎలాంటిది? నిప్పులాంటి వంశం. ఇంత వరకు తమ వంశంలోని వాళ్ళెవరూ ఇతరులచేత వ్రేలెత్తి చూపించుకోలేదు.

కాని హైమ తను చెప్పిందివిని ఎద్దేవా చేసింది. "మీ వంశమంతా నిప్పుకాదు. మీ వంశంలోని ఆడవాళ్ళు మాత్రమే నిప్పులు. మీ ఆయన, మీ అన్నదమ్ములు అందరూగ్రంథ సాంగులే" అంది. "మీ ఆయన చేస్తేతప్పుకానిది నువ్వు చేస్తే తప్పు అవుతుందా?" అని నిలదీసింది. ఇంకేవేవో చెప్పి, వాదించి, తన బుర్రపాడుచేసి ఏ రొష్టూ లేకుండా బ్రతుకుతున్న తననీ ఊబిలోకి దింపింది.

"ఏమ్మా! ఏం చేస్తావు?" శ్రుతి ప్రశ్నతో సీతారత్నం హృదయంలోని న్యూనత, పశ్చాత్తాపం,

దుఃఖం ఒక్కసారి వెల్లువలాపొంగి బయటికి దుమికింది. చటుక్కున మంగళ సూత్రాలు కాక తన ఒంటి మీదవున్న ఒకే ఒక బంగారు వస్తువు వ్రేలి ఉంగరాన్ని తీసి శ్రుతి టేబిల్ మీదపెట్టి ఆమె కాళ్ళమీద పడింది.

"అమ్మగారూ! ఇది తీసుకుని నా కడుపులోని పాపాన్ని తీసేయండి. ఒక దరిద్రపు గొట్టుదాని మాటల్ని విని నాబుద్ధి చెడిపోయింది. పట్నంలో లాడ్జింగ్‌కి తీసుకెళ్ళి ఎవడో మగాడికి నన్ను అప్పగించింది. అప్పుడుగాని నా ఒళ్ళు నాకు తెలియలేదు. నేను చేసిందిఎంత తప్పుడుపనో నాకు తెలిసొచ్చేసరికి జరగాల్సిన ఘోరం జరిగిపోయిందమ్మా!" అని వెక్కివెక్కి ఏడుస్తూన్న సీతారత్నాన్నెలా ఓదార్చాలో శ్రుతికి తెలియలేదు. తన కాళ్ళను విడిపించుకుని ఆమెను లేపి స్టూలు మీదకూర్చో బెట్టింది. ప్రేమచేతనో, ఆకర్షణ చేతనో, సెక్స్ పరమైన వాంఛలు తీరే అవకాశంలేకో, తనని, తన బిడ్డల్ని ఆకలి చావుకు గురవకుండా బ్రతికించుకోవడానికో కాదీమె వివాహేతర లైంగిక సంబంధాన్ని పెట్టుకుంది. వస్తువ్యామోహంతో అజ్ఞానంతో తన శరీరాన్ని అమ్ముకున్న ఆమెను చూసి జాలిపడాలో, కోపం తెచ్చుకోవాలో అర్థంకాలేదు శ్రుతికి.

"మైకం విడిపోయి నాపొరపాటు నాకు తెలవగానే యింత విషం మింగి చావాలనిపించింది. చెడిపోయినదాన్ని! ఆ ఇంట్లో నా పిల్లలతో, భర్తతో ఏమీ జరగనట్లు మునుపటిలా ఎట్లాబ్రతకగలననిపించింది. కాని... చేజేతులాబ్రతుకును పాడజేసుకున్న నాకు చావడానికి ధైర్యం చాలడం లేదు". అంటూ కుమిలి కుమిలి ఏడుస్తూ ఆగి, ఆగి చెబుతోంది సీతారత్నం.

'తర తరాల భావజాలంలో బంధింపబడిన ఈమె వివాహం, పాతివ్రత్యం, శీలం, నీతి, అవినీతులను గురించి ఆ భావజాలపు పరిధిలోనే ఆలోచించడం సహజం' అనుకుంది శ్రుతి.

"ఎవరికీ చెప్పుకోలేని ఈ సమస్యతో నా బుర్రనిండా నింపిన గందరగోళంలో నాకళ్ళకు పొరలు కమ్మాయి. హైమచెప్పిన వస్తువులమీద కోరికో, లేక ఎవరెవరితోనో తిరుగుతున్న మా ఆయనమీద కోపంతోనో ఆమె మాటల ఉచ్చులో పడిన నాకు బురదలో పడిన వాళ్ళను బయటకులాగే ప్రయత్నం చెయ్యాలే తప్ప మనమూ బురదలోకి జారకూడదనే ఇంగితం లేకపోయింది" పశ్చాత్తాపంతో దగ్ధమౌతున్న సీతారత్నం వంక జాలిగా చూసింది శ్రుతి. మ్యూజిక్ ఛానెల్లో వయొలిన్ నాదం విషాదంగా వినిపిస్తూంది.

కథా నిలయం
5487
శ్రీకాకుళం